యానాం 'రీజెన్సీ' విధ్వంసం కేసులో
ఇద్దరు అధికారులకు జైలు
- 5లో

పిల్లలతో కలిసి తల్లి
గోదావరిలో దూకే యత్నం
కాపాడిన ఐ.పోలవరం పోలీసులు... 5లో


ఎన్.కొత్తపల్లిలో పూడుకుపోయిన పంట కాల్వ

"మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేసినట్టు ప్రభుత్వం గతంలోనే ప్రకటించింది. ఇందుకు అనుగుణంగా గత కొన్నేళ్లుగా రైతులకు ఉపయోగపడే పనులు చేపట్టడంలో ఉపాధి అధికారులు ప్రయోగాత్మకంగా ముందడుగు వేస్తున్నారు. అయినప్పటికీ వ్యవసాయానికి సంబంధించి కొన్ని కీలక సమయాల్లో మాత్రం అధికారులు రైతుల డిమాండ్లకు సానుకూలంగా స్పందించకపోవడం అన్నదాతల్లో అసంతృప్తి మిగిల్చింది. సమయానికి చేపట్టవలసిన పనులను ముందుగానో లేదా ఆలస్యంగానో చేస్తే ప్రయోజనం పెద్దగా ఉండదని తెలుస్తున్నా నిబంధనల చట్రంలో పాత విధానాలనే కొనసాగిస్తున్నారు."

అవసరం తీర్చని అనుసంధానం

- ముందుగానే కాల్వల్లో పూడికతీతలు
- నీటి అవసర సమయంలో ఎగదన్నుతున్న కాల్వలు
- ప్రణాళిక ప్రకారమే పనులంటున్న అధికారులు
- ప్రస్తుతం పూడికతీతలు చేపట్టాలని రైతుల డిమాండ్
- అనుసంధానంతో ప్రయోజనమేమిటని ప్రశ్నిస్తున్న రైతులు

ఉప్పలగుప్తం, జూన్ 23: వేసవిలో కాల్వల్లో పూడికతీతలు చేపడుతున్నారు. కాల్వలకు నీరు విడుదల చేసే సమయానికి కాల్వలు తూడు, గుర్రపుడెక్కతో మూసుకుపోతున్నాయి. మళ్లీ పూడికతీతకు నిబంధనలు అడ్డునిలుస్తాయి. పొలాలకు నీరందక రైతులు గగ్గోలు పెడుతున్నారు. కాల్వల్లో పూడిక తీయాలని కోరుతున్నారు. సమాధానం చెప్పుకోలేక మండల స్థాయి అధికారులు నానాయాతన పడుతున్నారు. నిజానికి ప్రతిఏటా మార్చిలో సంవత్సర పనుల బడ్జెట్ కేటాయింపు జరుగుతుంది. గ్రామసభల ద్వారా పనులు, వ్యయం, పనిదినాల రూపకల్పన జరుగుతుంది. 2024లో మండలానికి రూ.12 కోట్లతో బడ్జెట్ రూపొందించారు. వివిధ కేటగిరీల్లో 1,490 పనులు చేసేందుకు ప్రణాళిక రూపొందించారు. ప్రస్తుతం నాట్లు వేసే సమయంలో సాగునీరు అందక రైతులు కాల్వలను బాగు చేయాలంటూ ఉపాధి అధికారులను డిమాండ్ చేస్తున్నారు. నాట్ల అనంతరం కూడా కొన్ని ప్రాంతాల్లో కాల్వల మూసుకుపోవడం ఏటా సర్వసాధారణమే. అప్పుడు రైతులు పూడికతీతల కోసం ఆందోళనలు సైతం చేపడుతున్నారు. అలాంటి సమయంలో ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో అత్యవసర పనులు చేపట్టి నీటి అవసరాలను తీరుస్తున్నారు. వాస్తవానికి ఏడాదికి ఒకేసారి కాల్వల్లో పూడికతీతకు ఉపాధిలో అనుమతి ఉన్నట్టు అధికారులు చెప్తున్నారు. వేసవిలో కాల్వల పూడికతీత పనులు పూర్తయిన ప్రాంతాల్లో సైతం ప్రస్తుతం కాల్వలు అధ్వానంగా ఉన్నాయి.



కాల్వల్లో నీటి ప్రవాహం తగినంతగా లేకుంటే నాట్లు వేసుకునేందుకు వెసులుబాటు ఉండదు. ఈ నేపథ్యంలో కొన్ని గ్రామాల రైతులు అధికారులకు వినతి పత్రాలు సమర్పించి పూడికతీత సమస్యలను పరిష్కరిస్తేనే సాగు చేసుకుంటామని వక్కాణిస్తున్నారు.

కాగా శనివారం ఎన్.కొత్తపల్లి రైతులు ఎంపీడీవో కొఠారి వెంకటేశ్వరప్రసాద్, ఏపీవో రాజామణికి వినతిపత్రాలు సమర్పించారు. ఉపాధి హామీ పథకం వ్యవసాయానికి అనుసంధానం అంటే రైతుల అవసరాలు తీర్చేలా వుండాలని రైతులు చెప్తున్నారు. నాట్లు, కోతల సమయంలో ఉపాధి పనులు నిలిపివేసి, కూలీలు పూర్తిగా వ్యవసాయ పనుల్లో ఉండేలే చర్యలు తీసుకోవాలన్నారు. అప్పుడే ఉపాధి పథకం రైతులకు సహాయపడుతుందని వివరించారు.

రైతుల అవసరాల మేరకు కాల్వల్లో పూడికతీత చేపడుతున్నాం

కె.రాజామణి, ఉపాధి ఏపీవో

ప్రతి ఏటా వార్షిక బడ్జెట్ ఉంటుంది. ఆ ప్రకారమే ఏడాదంతా పనులు చేపడతాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిబంధనల ప్రకారం పూడికతీతలు, పంటబోదెల త్వకం, ఇతర వ్యవసాయ అనుసంధాన పనులు జరుగుతుంటాయి. ఈ ఏడాది 1,490 పనులకు ప్రణాళిక రచించారు. ఇప్పటికే 871 పనులు జరిగాయి. కాల్వల్లో ప్రస్తుతం ఎన్ని సార్లు తొలగించినా తూడు, గుర్రపుడెక్క పెరుగుతూనే ఉన్నాయి. దీని కోసం రైతులు తరచు ఇబ్బంది పడుతున్నారు. అయితే సాధ్యమైనంత వరకు సమస్యల పరిష్కారానికి ప్రయత్నిస్తున్నాం. ఉన్నతాధికారుల సూచనలతో రైతులకు ఉపయోగపడేలా ఉపాధి కార్యక్రమాన్ని నడిపిస్తున్నాం. ఎన్.కొత్తపల్లి కాల్వలో పూడికతీత పనులకు చర్యలు తీసుకుంటాం.

పొలం పనుల సమయంలో ఉపాధి కలిసిరావాలి

ఈదరపల్లి శ్రీనివాసరాజు, రైతు, ఎన్.కొత్తపల్లి

ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేశామనడం నిజం కాదు. రైతులు ఎన్నో ఏళ్ల నుంచి వ్యవసాయ పనుల సమయంలో ఉపాధి పనులు నిలిపి వెయ్యాలని కోరుతున్నారు. అయినా పట్టించుకున్నవారు లేరు. పంటకాల్వల్లో పూడికతీతలు రైతుల అవసారల మేరకు జరగాలి. అలా కాకుండా ఉన్నతాధికారుల ఒత్తిడితో పనిదినాల కల్పన ధ్యేయంగా మాత్రమే పనులు జరుగుతున్నాయి. ఏ సమయంలో జరగవలసిన పనులు ఆ సమయంలో కాకుండా పనిదినాల లక్ష్య సాధనకు మాత్రమే చర్యలు తీసుకుంటున్నారు. విధానంలో మార్పు రావాలి. వ్యవసాయానికి నూరు శాతం ఉపాధి పథకం ఉపయోగపడాలి.


ఎంపీడీవోకు వినతిపత్రం సమర్పిస్తున్న ఎన్.కొత్తపల్లి రైతులు


డీఎస్పీ విజయసారథిని సన్మానిస్తున్న ఎస్పీ శ్రీధర్, అదనపు ఎస్పీ ఖాదర్‌బాషా

హింసాత్మక ఘటనలకు తావు లేకుండా సార్వత్రిక ఎన్నికలు

బాధ్యతగా పనిచేసిన పోలీసులకు ఎస్పీ శ్రీధర్ అభినందనలు

అమలాపురం రూరల్, జూన్ 23: ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా పనిచేస్తూ జిల్లాలో ఎటువంటి హింసాత్మక సంఘటనలకు తావు లేకుండా సార్వత్రిక ఎన్నికల ప్రక్రియను దిగ్విజయంగా పూర్తిచేసిన పోలీసులు, అధికారులు, సిబ్బందికి ఎస్పీ ఎస్.శ్రీధర్ అభినందనలు తెలిపారు. పోలింగ్ ప్రక్రియ నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తయ్యే వరకు జిల్లాలో ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా రేయింబవళ్లు కృషి చేసిన పోలీసులు, కేంద్ర సాయుధ బలగాల కృషిని ఆయన అభినందించారు. ఇందుపల్లిలోని ఎ1 కన్వెన్షన్ హాలులో ఆదివారం జిల్లా పోలీసు అధికారులతో ఎస్పీ సమావేశం నిర్వహించారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీసులు చేసిన కృషిని కొనియాడారు. ఉత్తమ సేవలు అందించిన పోలీసులు, అధికారులు, సిబ్బందికి జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను ఎస్పీ అందజేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎస్.ఖాదర్‌బాషా, అమలాపురం, రామచంద్రపురం, కొత్తపేట డీఎస్పీలు ఎం.మహేశ్వరరావు, బి.రామకృష్ణ, కె.వెంకటరమణ, ఏఆర్ డీఎస్పీ విజయసారథి, ఎస్‌బీ, డీసీఆర్‌బీ, సోషల్ మీడియా సెల్, ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు, జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసు అధికారులు పాల్గొన్నారు.


సార్వత్రిక ఎన్నికల్లో ఉత్తమ సేవలందించిన పోలీసు అధికారులతో ఎస్పీ శ్రీధర్

మెల్‌బోర్న్‌లో టీడీపీ విజయోత్సవ సంబరాలు ...6లో



ఒలింపిక్ డే రన్ క్రీడా జ్యోతితో కలెక్టర్ హిమాన్షు శుక్లా

జాతీయ స్థాయి పోటీల్లో రాణించాలి

క్రీడాకారులకు కలెక్టర్ హిమాన్షు శుక్లా పిలుపు

అమలాపురం, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో రాణించడమే కాకుండా అంతర్జాతీయ పోటీలకు అర్హత సాధించేలా శిక్షణ పొందాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా పేర్కొన్నారు. జిల్లాలో క్రీడల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. క్రీడా ఐక్యతను చాటేందుకు ఒలింపిక్ డే రన్ ఎంతో దోహదపడుతుందన్నారు. జిల్లా స్థాయిలో ఒలింపిక్‌డే రన్-2024 సందర్భంగా ప్రారంభోత్సవ సభను అమలాపురం దుడ్డువారి అగ్రహారంలోని ఆఫీసర్స్ రిక్రియేషన్ క్లబ్‌లో ఆదివారం ఉదయం అల్లాడ శరత్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ హిమాన్షు శుక్లా మాట్లాడుతూ రంకిరెడ్డి సాత్విక్ సాయిరాజ్ బ్యాడ్మింటన్‌లో రాణించి ఒలింపిక్స్‌లో పాల్గొని సత్తాచాటి కోనసీమ ఖ్యాతిని ఇనుమడింపచేశారని కొనియాడారు. తల్లిదండ్రులు సైతం క్రీడాకారులను ప్రోత్సహించాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ శుక్లాతో పాటు ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణ, ఒలింపిక్ అసోసియేషన్ ప్రతినిధి డాక్టర్ మెట్లవెంకటసూర్యనారాయణలను ఒలింపిక్ సంఘం తరపున దుశ్శాలువాలు కప్పి పుష్పమాలలతో సత్కరించారు. అనంతరం క్రీడా జ్యోతిని కలెక్టర్ ప్రకాశనం చేశారు. ఆఫీసర్స్ రిక్రియేషన్ క్లబ్ వద్ద ప్రారంభమైన ఒలింపిక్ రన్ గడియార స్తంభం సెంటర్, హైస్కూలు సెంటరు, సుబ్బారాయుడు చెరువు, కూచిమంచి అగ్రహారం మీదుగా తిరిగి ఓఆర్సీకి చేరుకుంది. కార్యక్రమంలో రన్ కన్వీనర్ రంకిరెడ్డి కాశీ, కార్యనిర్వాహక కార్యదర్శి పప్పుల శ్రీరామచంద్రమూర్తి, కల్వకొలను బాబు, డాక్టర్ పప్పు శర్మ, డాక్టర్ విష్ణుమూర్తి, డాక్టర్ కొప్పినీడి వెంకటరమణకుమార్, షకీలా, మునగాల మస్యం, విత్తనాల శ్రీనివాస్, ఉండ్రు ముసలయ్య, పురుషోత్తం, తోట రవి, వైఎస్సీ రమణ, వై.చంటి, ఉమామహేశ్వరరావు, శ్రీదేవి, గన్నవరం సీఐ ప్రశాంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. రన్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పతకాలు, సర్టిఫికెట్లను కలెక్టర్ అందజేశారు.


ఒలింపిక్ డే రన్‌లో పాల్గొన్న క్రీడాకారులు

మార్కెట్ కమిటీలకు ఆదాయం ఘనం
రైతులకు అందించే సేవలు శూన్యం

- అందుబాటులో లేని రైతు బంధు పథకం
- గోదాముల నిర్మాణాన్ని గాలికొదిలేసిన వైనం



అమలాపురంలో అద్దె భవనంలో వున్న మార్కెట్ కమిటీ కార్యాలయం

అమలాపురం రూరల్, జూన్ 23: వ్యవసాయ మార్కెట్ కమిటీలకు ఏటా కోట్లాది రూపాయల ఆదాయం వస్తుంది. కానీ ఐదేళ్ల వైసీపీ పాలనలో రైతులకు ఇసుమంతైనా సేవలు అందించలేని పరిస్థితి. గతంలో టీడీపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు అమలు చేసిన పథకాలను వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత గాలికొదిలేసింది. ఒక్క అమలాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీలోనే సుమారు రూ.13 కోట్ల మేర నిధులు నిల్వ ఉన్నాయి. ఇక జిల్లాలో అత్యధిక ఆదాయం వచ్చే మార్కెట్ కమిటీల్లో ఏ స్థాయిలో నిధులు ఎలా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. రైతులు పండించే వ్యవసాయ ఉత్పత్తులపై ఒక శాతం సెస్ (పన్ను)ను మార్కెట్ కమిటీలు ముక్కుపిండి మరీ వసూలు చేస్తున్నాయి. అయితే సెస్ చెల్లించే రైతుల సంక్షేమాన్ని మాత్రం మార్కెట్ కమిటీలు పట్టించుకోవట్లేదు. ఏటా కోట్లాది రూపాయలు సెస్ రూపంలో వసూలు చేస్తున్నా ఆ నిధులను రైతుల సంక్షేమానికి ఖర్చు చేసిన దాఖలాలు జిల్లాలో ఎక్కడా లేవు.

లింకు రోడ్ల నిర్మాణాలు ఏవీ...

రైతులు పండించిన వ్యవసాయ ఉత్పత్తులను పంట చేలు, కళ్లాల నుంచి ఇళ్లకు తరలించుకునేందుకు లింకు రోడ్ల నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది. గతంలో ఒక్కో మార్కెట్ కమిటీ పరిధిలో 30 శాతం నిధులను లింకు రోడ్ల నిర్మాణానికే కేటాయించేవారు. మార్కెట్ కమిటీలు ఏడాదికి 10 నుంచి 15 రహదారులు నిర్మించిన పరిస్థితులు గతంలో ఉండేవి. రైతుల అవసరాల మేరకు లింకు రోడ్లు నిర్మించేవారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో జిల్లాలో ఒక్క లింకు రోడ్డు కూడా నిర్మించలేదు. కాకపోతే ప్రతిపాదనలు పంపించడం విశేషం. మార్కెట్ కమిటీల పాలకవర్గాల సమావేశాల్లో మాత్రం అనుబంధ రహదారుల కోసం తీర్మానాలు చేశారు.

రైతుబంధు పథకం ఉన్నట్టా.. లేనట్టా..

రైతుల సంక్షేమం కోసం గతంలో రైతుబంధు పథకాన్ని అమలు చేశారు. వైసీపీ ఏలుబడిలో ఆ పథకాన్ని వినియోగించుకున్న ఒక్క రైతు కూడా లేడంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. రైతులు పండించిన వ్యవసాయ ఉత్పత్తులకు సరైన మద్దతు ధర లేనిపక్షంలో పంటను కమిటీలకు కుదవ పెట్టుకుని రుణాలు పొందే వెసులుబాటు కల్పించే పథకమే రైతుబంధు. పంట విలువలో 80 శాతం వరకు రైతులకు రుణంగా ఇచ్చే అవకాశం ఉంది. రైతులకు సరైన ధర వచ్చిన తర్వాత ఆయా ఉత్పత్తులను విక్రయించి రుణాలను కమిటీలకు తిరిగి చెల్లించుకునే అవకాశం ఉండేది. మార్కెట్‌లో మద్దతు ధర లేని సమయాల్లో పండించిన పంటను ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకుని తీవ్రంగా నష్టపోతున్నారు.

జిల్లాలో తొమ్మిది మార్కెట్ కమిటీలు...

జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో తొమ్మిది వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఉన్నాయి. మండపేట వ్యవసాయ మార్కెట్ కమిటీకి అత్యధికంగా ఏటా రూ.9 కోట్ల నుంచి రూ.10 కోట్లు పైబడి ఆదాయం సెస్ రూపంలో వస్తోంది. కొత్తపేట నియోజకవర్గ పరిధిలోని ఆలమూరు మార్కెట్ కమిటీకి ఏటా రూ.5 కోట్లు పైగా ఆదాయం వస్తుంటే రావులపాలెం మార్కెట్ కమిటీకి రూ.4 కోట్లు దాకా వస్తోంది. అమలాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీకి రూ.3 కోట్లు, రాజోలు మార్కెట్ కమిటీకి రూ.2 కోట్లు, రామచంద్రపురం, ముమ్మిడివరం మార్కెట్ కమిటీలకు రూ.4 కోట్లు చొప్పున వస్తోంది. పి.గన్నవరం నియోజకవర్గ పరిధిలోని అంబాజీపేట మార్కెట్ కమిటీకి రూ.3 కోట్లు పైబడి, నగరం మార్కెట్ కమిటీకి రూ.1.50 కోట్లు పైబడి ఆదాయం సమకూరుతోంది.

పశు వైద్య శిబిరాలు ఏవీ!

మార్కెట్ కమిటీలు పాడి పంటలకు గతంలో అధిక ప్రాధాన్యతనిచ్చేవి. పంటను పండించడంతో పాటు పాడి సంపదను అభివృద్ధి చేసేందుకు కృషి చేసేవి. పాడి రైతులను ఆదుకునే విధంగా ఒక్కో మార్కెట్ కమిటీ పరిధిలో రూ.20వేల వరకు ఖర్చు చేస్తూ ఏడాదికి రూ.80వేలు వ్యయం చేసి నాలుగు పశు వైద్య శిబిరాలను నిర్వహించేవారు. వైసీపీ ప్రభుత్వంలో ఒక్క వైద్య శిబిరం నిర్వహించిన దాఖలాల్లేవు. కోట్లాది రూపాయల ఆదాయం వస్తున్నా కనీసం పశువైద్య శిబిరాలను నిర్వహించలేని దుస్థితిపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పాడి రైతులు సొంత ఖర్చులతోనే పశువులకు వైద్య సేవలు అందించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

మార్కెట్ కమిటీల నిధులతోనే వ్యవసాయ ఉత్పత్తులు నిల్వ చేసుకునేందుకు గోదాములు, శీతల గిడ్డంగులు నిర్మించాల్సి ఉంది. జిల్లాలో వైసీపీ పాలనలో ఒక్క గోదామును కూడా నిర్మించకపోగా అసంపూర్తి భవనాలను సైతం పూర్తి చేయలేదు. అమలాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోని ఉప్పలగుప్తంలో అసంపూర్తిగా మిగిలిపోయిన గోడౌన్‌పైకప్పు నిర్మాణం కోసం ఇటీవల ఏఎంసీ చైర్‌పర్సన్‌గా రాజీనామా చేసిన దంగేటి డోలామణి రూ.40లక్షలు మంజూరు చేయించారు. కానీ పనులను ప్రారంభించలేకపోయారు.



ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కోసం రూపొందించిన వెబ్‌సైట్

నేటి నుంచి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

అమలాపురం టౌన్, జూన్ 23: కూటమి ప్రభుత్వం కొలువుదీరిన అనంతరం సోమవారం నుంచి జిల్లా కేంద్రాల్లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను ప్రారంభిస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో భాగంగా సోమవారం ఉదయం పది గంటలకు అమలాపురంలోని కలెక్టరేట్ గోదావరిభవన్‌లో పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టమ్ ప్రారంభిస్తున్నట్టు కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు తాత్కాలిక విరామం ప్రకటించారు. ఇకపై ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను నిర్వహించనున్నట్టు కలెక్టర్ చెప్పారు.


దర్శకుడు హనుకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న దృశ్యం

ప్రభాస్ నూతన చిత్ర స్క్రిప్ట్‌నకు పూజలు

అంతర్వేది, జూన్ 23: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహ స్వామిని ప్రముఖ సినీ దర్శకుడు హను రాఘవపూడి ఆదివారం దర్శించుకున్నారు. త్వరలో ప్రభాస్‌తో నిర్మించనున్న నూతన చిత్ర స్క్రిప్ట్‌ను స్వామివారి పాదాల చెంత ఉంచి ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. సీతారామమ్ సినిమాతో విజయం అందుకున్న హను రాఘవపూడి ప్రభాస్‌తో నూతన చిత్రానికి దర్శకత్వం వహించనున్నానన్నారు. ఆయనకు టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు ముప్పర్తి నాని, వనమాలి మూలాస్వామి స్వామివారి చిత్రపటాన్ని అందించారు. కార్యక్రమంలో శంకరగుప్తం నాని, అర్చకులు పాల్గొన్నారు.

చుక్ చుక్ బండి... ఇలాగైతే ఎలాగండి!





ప్రజలకు ప్రధాన రవాణా సాధనాలు రైళ్లు. అయితే సుమారు రెండేళ్లుగా రైళ్లు ఎక్కాలంటే జనాలు బెంబేలెత్తిపోతున్నారు. ప్రయాణంలో నరకం చూస్తున్నారు. ఎందుకంటే ఏ రైలు ఎప్పుడొస్తుందో.. అసలు వస్తుందో రాదో.. ఒకవేళ అదృష్టం బాగుండి వచ్చినా గమ్యానికి ఎప్పుడు చేరుస్తుందో ఎవరూ చెప్పలేని పరిస్థితి. నిర్వహణ పేరుతో దారి మళ్లించ డం, తాత్కాలికంగా రద్దు చేస్తుండడంతో రైలు ప్రయాణం అయోమయంగా మారింది. ఇది చాలదన్నట్టు ఇప్పుడు రాజమండ్రి రైల్వేస్టేషను గుండా నడుస్తూ.. ప్రజాదరణ ఎక్కువగా కలిగిన 26 రైళ్లను ఏకంగా నెలన్నరపాటు రద్దు చేశారు.

- ఇప్పటికే ఉసూరుమంటున్న ప్రయాణికులు
- నేటి నుంచి ఏకంగా 26 రైళ్లు రద్దు
- నిర్వహణ పేరుతో నెలన్నర బంద్
- సుదూరాల నుంచి వచ్చే రైళ్లే దిక్కు
- వాటిలో కాలు పెట్టలేని దుస్థితి
- ఇంటర్ సిటీలు వేయాలని డిమాండ్
- కొత్త ఎంపీ పట్టించుకోవాలని అభ్యర్థన

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

తూర్పు, కాకినాడ, అంబేడ్కర్ కోనసీమ, ఏఎస్ఆర్ జిల్లా ప్రయాణికుల కు అగచాట్లే.. ముఖ్యంగా చెన్నై, హైదరాబాద్, బెంగళూరుకు రాకపోకలు సాగించే వాళ్లకు మరిన్ని తిప్పలు తప్పకపోవచ్చు. సింహాద్రి రైలును తాత్కాలికంగా రద్దు చేస్తేనే జనాలు అల్లాడిపోతారు. అలాంటి పరిస్థితుల్లో రత్నాచల్, సర్కారు, జన్మభూమి, లింక్, తిరుపతి-కాకినాడ బళ్లను ఆపేయడంవల్ల ప్రయాణికుల ఇబ్బందులు తారాస్థాయికి చేరే అవకాశం ఉంది. కారణాలేమైనా ప్రత్యామ్నాయంగా ఇంటర్ సిటీలునడపాలనే డిమాండ్ వినవస్తోంది. తమ అవస్థలపై కొత్తగా ఎన్నుకున్న ఎంపీ పురందేశ్వరి దృష్టి సారించాలని గోదా రోళ్లు కోరుతున్నారు. ఏదేమైనా రైళ్ల గాడి తప్పడంపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

చుక్‌చుక్ బండి ఎందుకిలా..

2023 జూన్ 2వ తేదీ రైల్వే చరిత్రలోనే దారుణమైన దుర్ఘటన. ఒడిషాలోని బాలాసోర్ వద్ద కోరమాండల్ మరో రెండు రైళ్లు ఢీకొన్న ప్రమాదంలో 300 మందికిపైగా బలైపోయారు. దీంతో రైల్వే ఉలిక్కిపడింది. అత్యున్నత స్థాయిలో సమావేశాలు జరిగాయి. భద్రతకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని.. ట్రాక్, సిగ్నల్స్ వంటి కీలకమైన విభాగాలకు నిర్వహణ (మెయింటెనెన్స్)కు తగు సమయం కేటాయించాలని నిర్ణయించారు. ఆ మేరకు పనులు ఆరంభించారు. వీటి కోసం రోలింగ్ బ్లాక్ కారిడార్ పేరుతో రైళ్లను తాత్కాలికంగా రద్దు చేయడం, దారి మళ్లించడం చేస్తున్నారు. నాటి నుంచి మెయింటెనెన్స్ అని బ్లాక్(ఆ ట్రాక్‌పై రైళ్లను రద్దు చేయడం) తీసుకొంటున్నారు. కానీ పనులు వేగంగా చేయడం లేదనే విమర్శలున్నాయి. దీంతో రైళ్ల రాకపోకల్లో తీవ్ర జాప్యం ఏర్పడుతోంది. ఉదాహరణకు రాజమండ్రి రైల్వే స్టేషన్‌లో రెండో ప్లాట్‌ఫాం ట్రాక్‌కి మరమ్మతులు పూర్తిచేశారు. ప్లాట్‌ఫాం మరమ్మతులు పూర్తి చేయడంలో జాప్యం జరుగుతోంది. దీంతో ట్రాక్ సిద్ధమైనా ప్రయాణికుల రైళ్లను నడపలేని పరిస్థితి నెలకొంది.

అసలే అంతంత మాత్రం..

రాజమండ్రి రైల్వే స్టేషను ద్వారా ప్రతి రోజూ 10 వేల మంది వరకూ ప్రయాణాలు సాగిస్తున్నారు. వీరిలో ఉభయగోదావరి జిల్లాలకు చెందిన ప్రజలు ఉంటారు. ప్రయాణికులు ఎక్కువగా రాకపోకలు సాగించే రైళ్లతో పాటు మొత్తం 26 రైళ్లను తాత్కాలికంగా రద్దు చేశారు. కడియం-నిడదవోలు మధ్య పూర్తిస్థాయిలో మరమ్మతులంటూ కారణంగా చూపుతున్నారు. అయితే రద్దు చేసే బదులు ఆయా స్టేషన్లను మినహాయించి నడిపే ఆలోచన చేశారో లేదో అనేది ప్రశ్నగానే మిగిలిపోతోంది. ఇప్పటికే బెంగళూరు వెళ్లే వారికి ఇటు నుంచి అటు నుంచి సరైన రైళ్లు లేవు. హతియా-హౌరా-న్యూతిన్సూకియా, టాటా, భువనేశ్వర్ నుంచి ఉన్నాయి. అమృత్ భారత్ సోమవారం ఇటు నుంచి మంగళవారం అటు నుంచి ఉంది. కాకినాడ నుంచి బెంగళూరుకు ఉన్న శేషాద్రి మాత్రమే ఈ ప్రాంతం వాళ్లకు దిక్కు. భువనేశ్వర్ నుంచి వచ్చే హమ్‌సఫర్ ఎక్స్‌ప్రెస్ బుధవారం రాజమ హేంద్రవరం వస్తోంది. ఈ రైలుకి 20 రోజులు ముందు టికెట్ చేయించుకుంటే రూ.2 వేలు అవుతుంది. ముజఫర్‌పూర్, న్యూతిన్సూకియా, భువనేశ్వర్ నుంచి వారానికి ఒకసారి, గువాహటి నుంచి వారానికి మూడుసార్లు రైళ్లు ఉన్నా బోగీల్లో కాలు పెట్టడానికి వీలుండదు. జన్ సాధారణ్ రైళ్లు ఉన్నాయని రైల్వే చెబుతున్నా అవి గువాహటి, హౌరా వంటి సుదూర ప్రాంతాల నుంచి ఉండడంతో అక్కడ బోగీలు నిండిపోతాయి. ఈ ప్రాంతం వాళ్లకు వాటితో ఎలాంటి ఉపయోగమూ లేదు. చెన్నైకి టాటా, ధన్‌బాద్, పురూలియా, న్యూతిన్సూకియా, షాలిమార్(కోరమాండల్), హౌరా, భువనేశ్వర్ నుంచి ఉన్నాయి. హౌరా-కన్యాకుమారి, భువనేశ్వర్-పుదుచ్చేరి, ముజఫర్ పూర్-జోలార్‌పెట్టై వరకూ వారానికి ఒకసారి, సిల్చార్-కోయంబత్తూరు, భువనేశ్వర్-చెన్నై, జసిద్-తాంబరం(గురు), ఖరగ్‌పూర్- విల్లుపురం, భువనేశ్వ ర్-రామేశ్వరం, విశాఖ-చెన్నై (శుక్ర), హౌరా-తిరుచిరా పల్లి(సోమ,శుక్ర) గువాహటి నుంచి మూడురోజులు జోలార్‌పేట్ వరకూ, షాలిమార్- త్రివే ంద్రం (మంగళ, బుధ) ఉన్నాయి. సంత్రాగచి-చెన్నై ఏసీ ఎక్స్‌ప్రెస్ బుధ, శనివారాల్లో నడుస్తోంది. వీటిలో బెర్తులు దొరకాలంటే అదృష్టాన్ని నమ్ముకోవాల్సిందే. హైదరాబాద్‌కి వందే భారత్(ఆదివారం మినహా) వేసినా దానికి సమయపాలన ఇంకా అలవాటు పడలేదు. పైగా ఛైర్‌కార్ రూ.1425, ఎగ్జిక్యూటివ్ ఛైర్ కార్ రూ.2535 ధరలు ఉండడంతో సామాన్యుడు ఎక్క లేని పరిస్థితి ఉంది. మరో వందే భారత్(గురువారం మినహా) నడుస్తోంది. భువనేశ్వర్, హౌరా, షాలిమార్ నుంచి వచ్చే రైళ్లలో అడుగు పెట్టడానికి వీలుండదు. ఇప్పుడు జన్మభూమి, కోకనాడను తాత్కాలింకగా రద్దు చేయడంతో గౌతమి, గోదావరిపై మరింత ప్రయాణికుల భారం పడనుంది.

రద్దు చేసిన రైళ్లు ఇవే..

ఈనెల 24 నుంచి ఆగస్టు 10వ తేదీ వరకూ 26 రైళ్లను రానుపోను తాత్కాలికంగా నిలిపివేశారు. రైలు నెం.07466, 07467 (రాజమండ్రి-విశాఖ మెము), 17257, 17258 (కాకినాడ-విజయవాడ మెము), 17219, 17220 (మచిలీపట్నం-విశాఖ), 17249, 17250 (తిరుపతి-కాకినాడ), 17239, 17240(సింహాద్రి), 17243, 17244(రాయగడ), 12861, 12862(లింక్ దక్షిణ్), 12717, 12718(రత్నాచల్), 12805, 12806(జన్మభూమి), 17643, 17644(సర్కారు), 22701, 22702(ఉదయ్), 12775, 12776(కోకనాడ), 22707, 22708(విశాఖ-తిరుపతి డబుల్ డెకర్) రైళ్లు 47 రోజుల పాటు రాకపోకలు సాగించవు. ఈ మేరకు ఫిబ్రవరి 19వ తేదీనే ఆదేశాలు జారీ అయ్యాయి. బీసీఐ, టీఎఫ్‌టీఆర్, పీక్యూఆర్ఎస్ పనుల కోసం రైళ్లను తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్టు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

గంట ఆలస్యంగా గౌతమి ఎక్స్‌ప్రెస్ రైలు



సామర్లకోట, జూన్23: కాకినాడ నుంచి లింగంపల్లి వెళ్లే గౌతమి ఎక్స్‌ప్రెస్ రైలు ఆదివారంరాత్రి గంట ఆలస్యంగా కాకినాడనుంచి బయలుదేరి సామర్లకోటకు చేరుకుంది. లింగంపల్లి నుంచి కాకినాడ వచ్చే గౌతమి ఎక్స్‌ప్రెస్ ఆదివారం ఉదయం సుమారు 270 నిమిషాలు ఆలస్యంగా సామర్లకోటచేరుకుని కాకినాడపోర్టుకు చేరుకుంది. సాధారణ నిర్వహణలో భాగంగా గంట ఆలస్యంగా తిరిగి లింగంపల్లికి బయలుదేరింది. దీంతో నిర్ధేశిత సమయం రాత్రి 7.10 నిమిషాలకు కాకినాడ నుంచి బయలుదేరాల్సి ఉన్నప్పటికీ గంట ఆలస్యంగా రాత్రి 8.10కు బయలుదేరింది. విజయ వాడ రైల్వే సెక్షన్‌లో వివిధ అభి వృద్ధి పనులలో భాగంగా గౌతమి రైలు రీషెడ్యూల్ చేయాల్సివచ్చి నట్లు రైల్వే సీపీటీఎం (విజయవాడ) అధికారి ఆదివారం రాత్రి తెలిపారు. దీంతో సామర్లకోట తదితర రైల్వే స్టేషన్లలో వివిధ ప్రాంతాల కు వెళ్లే ప్రయాణికులకు ముందస్తు సమాచారం లేకపోవ డంతో గంటసేపు రైల్వేస్టేషన్లో ఎదురుచూపులు చూడాల్సి వచ్చింది.

భగవంతుని ఆరాధనతోనే

మానసిక ప్రశాంతత

'మహా సహస్రావధాని' డాక్టర్ గరికపాటి నరసింహారావు



ప్రవచనాలు ఇస్తున్న డాక్టర్ గరికపాటి

మండపేట, జూన్ 23: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా మండపేటలోని ధర్మగుండం చెరువువద్ద ఉన్న రామాలయం కమిటీ సారథ్యంలో సీతారామ కల్యాణ మండపంలో 'మహా సహస్రావధాని' డాక్టర్ గరికపాటి నరసింహారావు మూడురోజుల ప్రవచనాలు ఆదివారంతో ముగిశాయి. భగవంతుని ఆరాధనతోనే మానసిక ప్రశాంతత ఉంటుందన్నారు. జీవుల పట్ల మానవత, దయా హృదయం కలిగి ఉండాలని కోరారు. సమాజంలో కులతత్వం పోవాలన్నారు. అందరూ సమానమేనన్న భావన ప్రతిఒక్కరిలోనూ రావాలన్నారు. నేటి సమాజంలో జరుగు తున్న వాస్తవాలను గరికపాటి తనదైనశైలిలో వివరించారు. రాష్ట్రంలో పాలన, ప్రజల ఇబ్బం దులను ఆయన వివరించిన తీరు ఆకట్టుకుంది. ఎందరో మహనీయులు, భగవత్ స్వరూపులు వున్న జిల్లా ఉమ్మడి తూర్పుగోదావరి అన్నారు. జిల్లాలోని శివాలయాల ప్రాశస్త్యాన్ని భక్తులకు వివరించారు. పిఠాపురం కుక్కుటేశ్వరస్వామి ఆలయ విశిష్టత, శివతత్వం, గోమాత విశిష్టతలను తెలియజెప్పారు. ఆవు గడ్డి తిని పాలు ఇస్తుంటే ప్రభుత్వ ఉద్యోగి మాత్రం లంచం అంటూ అంటకాగుతున్నాడని, ఆ విధానం మానుకోవాలని పిలుపునిచ్చారు. మానవసేవే మాధవసేవగా సమాజంలో అందరూ మానవ సేవ ద్వారా దైవసేవ చేసి వారి ఆశీస్సులు పొందిననాడే వారికి పుణ్యఫలాలు దక్కుతాయన్నారు. దేవాలయాలకు వెళ్లినప్పుడు భక్తులు కోరికలు కోరకుండా భగవంతుడు ఇచ్చిన వాటినే స్వీకరించాలన్నారు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మంచి పాలన అందించాలన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సారథ్యంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. మాండవ్యపురం విశిష్టతను కూడా వివరించారు. మాండవ్యముని గురించి, డొక్కా సీతమ్మ గురించి ప్రసంగిం చారు. అనంతరం గరికపాటిని కమిటీ నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. వేద పండితులు వేదాశీర్వచనాలు అందించారు. మూడు రోజులపాటు జరిగిన ప్రవచనాల్లో నిర్వాహకులు ఇనపకోళ్ల అబ్బు, వల్లూరి నల్లబ్బు, విజ్ఞాన్ రాంబాబు, పలువురు సభ్యులు, పట్టణ ప్రముఖులు, అశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సత్యదేవుడిని దర్శించుకున్న పాతపట్నం ఎమ్మెల్యే



ఎమ్మెల్యే గోవిందరావుకు స్వామివారి ప్రసాదం అందజేస్తున్న పీఆర్వో

అన్నవరం, జూన్ 23: సత్యదేవుడి సన్నిధిలో ఆదివారం శ్రీకాకుళం జిల్లా పాతపట్నం ఎమ్మెల్యేగా కూటమి తరుపున పోటీచేసి గెలుపొందిన మామిడి గోవిందరావు స్వామిని దర్శించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ పీఆర్వో కృష్ణారావు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు.

పాదగయలో రైల్వేకోడూరు ఎమ్మెల్యే పూజలు



పాదగయ క్షేత్రంలో రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్

పిఠాపురం, జూన్ 23: కాకినాడ జిల్లా పిఠాపురంలోని పాదగయ క్షేత్రాన్ని రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ ఆదివారం సాయంత్రం సందర్శించారు. పాదగయలోని కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికా అమ్మవార్లను దర్శించుకుని పూజలు నిర్వహించారు. క్షేత్రప్రాశస్త్యం గురించి వేదపండితులు వివరించి ఆశీర్వచనాలు పలికారు. ఆలయ అధికారులు శేషవస్త్రాలతో సత్కరించి ప్రసాదాలు అందజేశారు. ఆయన వెంట పాదగయ మాజీ ఛైర్మన్ ఆగంటి ప్రభాకరరావు, బీజేపీ నాయకుడు పెండెం సత్యనారాయణ, ఏడుకొండలు తదితరులు ఉన్నారు.

డయేరియాని ఎదుర్కోండి



బెండపూడిలో మూసివేసిన బావిని పరిశీలిస్తున్న డైరెక్టర్ పద్మావతి

- వ్యాధిని గుర్తించిన వెంటనే పీహెచ్‌సీకి తరలించాలి
- ప్రతిరోజు తాగునీటి శాంపిళ్లు సేకరించాలి
- నిరంతర ఇంటింటి సర్వే చేయాలి
- ఏపీ హెల్త్ డైరెక్టర్ పద్మావతి

తొండంగి, జూన్ 23: గ్రామస్థాయిలో అన్నిశాఖలు సమన్వయంతో పనిచేసి డయేరియా వ్యాధిని పూర్తిగా ఎదుర్కోవాలని ఆంధ్రప్రదేశ్ హెల్త్ డైరెక్టర్ పద్మావతి తెలిపారు. ఆదివారం ఆమె కొమ్మనాపల్లి, బెండపూడి గ్రామాల్లో పర్యటించి సిబ్బందితో సమావేశమయ్యారు. కొమ్మనాపల్లిలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో డయేరియా ఇతర వ్యాధులు ప్రబలుతున్నందున ఆరోగ్య సిబ్బంది అప్రమత్తం కావాలన్నారు. గ్రామాల్లో పంచాయతీ ఆర్‌డబ్ల్యుఎస్,తదితర శాఖల సిబ్బందితో కలిసి ఆరోగ్య సిబ్బంది గ్రామస్థాయిలో కార్యక్రమాలు అమలు చేయాలన్నారు. ఎంఎల్‌హెచ్‌పీలు ప్రతిరోజు తాగునీటి వనరుల ప్రారంభస్థాయి, మధ్య, ముగింపు స్థాయిలవద్ద శాంపిళ్లు సేకరించి పరీక్షలు నిర్వహించాలన్నారు. గ్రామాల్లో ఆశ,హెల్త్ వర్కర్లు ఇంటింటి సర్వే చేయాలన్నారు. ఎవరైనా ఏదైనా రోగానికి గురైతే పీహెచ్‌సీకి తీసుకువెళ్లి అప్పగించాలన్నారు. తాగునీటి వనరులు కలుషితం కారణంగా రోగాలు వ్యాప్తి చెందుతున్నందున పంచాయతీ సిబ్బందితో కలిసి పైప్‌లైన్ లీకేజీ, క్లోరినేషన్ వంటి కార్యక్రమాలు పర్యవేక్షించాలన్నారు. డయేరియా వ్యాధి పూర్తిగా అదుపులోకి వచ్చేంత వరకూ శిబిరాలను కొనసాగించాలన్నారు. గ్రామాల్లో వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామంలో ప్రస్తుత పరిస్థితిని వైద్యులు రవికుమార్, భారతిలను అడిగి తెలుసుకున్నారు. గ్రామ సర్పంచ్ కోన సూర్యనారాయణ అమ్మాజీని పంచాయతీ పరంగా తీసుకున్న చర్యల గురించి అడిగి పలు సూచనలు చేశారు. రీజనల్ డైరెక్టర్ పద్మ శశిధర్, డీఎంహెచ్‌వో నర్సింహనాయక్, అదనపు డీఎంహెచ్‌వో రమేష్, డిప్యూటీ డీఎంహెచ్‌వో సరిత తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆమె బెండపూడిగ్రామంలో పర్యటించి సిబ్బందితో సమావేశమయ్యారు. గ్రామంలో మూసివేసిన బావిని పరశీలించి పలు సూచనలు చేశారు.

స్టాప్ డయేరియాని విజయవంతం చేయాలి

సమీకృత డయేరియా నియంత్రణ (స్టాప్ డయేరియా) కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని హెల్త్ డైరెక్టర్ పద్మావతి తెలిపారు. బెండపూడిలో ఆమె మాట్లాడుతూ జూలై 1 నుంచి ఆగస్టు 31 వరకూ రెండు నెలల పాటు కార్యక్రమం అమలు జరుగుతుందన్నారు. ఐదు సంవత్సరాలలోపు వయసున్న పిల్లల్లో డయేరియా వ్యాధి నివారణకు తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ఆశ వర్కర్లు ఆరోగ్యసిబ్బంది ఇంటింటికీ వెళ్లి అవగాహన కలిగించాలన్నారు. జూలై 18 నుంచి ప్రారంభమై 31 వరకూ జరిగే లెప్రసీ సర్వేను కూడా గ్రామస్థాయిలో విజయవంతం చేయాలన్నారు,

త్వరలోనే పిఠాపురంలో పవన్ పర్యటన

- తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రాధాన్యం
- జనసేన ప్రధాన కార్యదర్శి నాగబాబు



ఇల్లింద్రాడ వద్ద కార్యకర్తలు, నాయకులతో మాట్లాడుతున్న నాగబాబు

పిఠాపురం, జూన్ 23: జనసేన అధినేత, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ మూడు, నాలుగు రోజుల్లో పిఠాపురం నియోజకవర్గంలో పర్యటించనున్నారని జనసేన ప్రధాన కార్యదర్శి నాగబాబు తెలిపారు. పిఠాపురం పట్టణ శివారు ఇల్లింద్రాడ వద్ద గల రైసుమిల్లులో ఆదివారం సాయంత్రం ఆయన జనసేన నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. గొల్లపల్లి పెదబాబీ ఆధ్వర్యంలో జనసేన నేతలు నాగబాబును ఘనంగా సత్కరించారు. తనను గెలిపించిన పిఠాపురం నియోజకవర్గ ప్రజలను కలుసుకోవాలనే ఆత్రుతతో పవన్ ఉన్నారని తెలిపారు. ఉపముఖ్యమంత్రిగా, ఐదుశాఖల బాధ్యతలు ఆయనపై ఉన్నాయని, వాటికి న్యాయం చేస్తూనే నియోజకవర్గంలో పర్యటిస్తారని చెప్పారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని పవన్ నెరవేరుస్తారని తెలిపారు. నియోజకవర్గ పరిధిలో తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రథమ ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. ప్రజల ఆకాంక్షలను నూరుశాతం ఆయన నెరవేరుస్తారని తెలిపారు. పిఠాపురం నియోజకవర్గానికి ఏదొకటి చేసిన తర్వాతే గెలుపు సంబరాలు చేసుకోవాలన్న ఆలోచనలో పవన్ ఉన్నారని చెప్పారు. పవన్‌ను మీ ఇంటి వ్యక్తిగా స్వీకరించాలని ఆయన పిఠాపురం ప్రజలను కోరారు. నియోజకవర్గ పరిధిలో జరిగే అక్రమ మైనింగ్‌ను అడ్డుకోవాలని, గంజాయి బ్లేడ్‌బ్యాచ్‌లు కనిపిస్తే పోలీసుస్టేషన్‌లో అప్పగించాలని సూచించారు. ఎన్నికల ముందు కొంతమంది వైసీపీ నాయకులను తీసుకున్నామని, ప్రజలకు ఉపయోగపడే వారు వచ్చి చేరతామంటే ఆలోచిస్తామని తెలిపారు. చాలామంది వైసీపీ కార్యకర్తలు గత ఎన్నికల్లో జనసేనకు పరోక్షంగా సహకరించారని చెప్పారు. ప్రజలను ఇబ్బందులకు గురి చేసే వారు పార్టీలో చేరతామంటే మాత్రం రెడ్‌మార్క్ వేసి ఆపివేస్తామని తెలిపారు. ఎవరు పార్టీలో చేరినా తొలిప్రాధాన్యం మాత్రం జనసేన, టీడీపీ కార్యకర్తలకే ఉంటుందని స్పష్టం చేశారు. మనకు తెలుగుదేశంతో ఎటువంటి విభేదాలు లేవని తేల్చి చెప్పారు. ప్రజల కోసం పవన్ ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన కోఆర్డినేటర్ మర్రెడ్డి శ్రీనివాసరావు, పలువురు జనసేన నాయకులు, జనసైనికులు పాల్గొన్నారు. కాగా గొల్లప్రోలు సొసైటీ ద్వారా రుణాలు తీసుకుని పంటలు నష్టపోయిన రైతులకు 2019-20లో పంటల బీమా పరిహారం ఇప్పటివరకూ అందలేదని, నాలుగు శాతం వడ్డీ రాయితీ సక్రమంగా అందడం లేదని సొసైటీ మాజీ అధ్యక్షుడు పడాల ఏసువెంకటరమణ నాగబాబు దృష్టికి తీసుకువచ్చి వినతిపత్రం అందజేశారు.



నేడు కుమార రామ భీమేశ్వరుడికి అభిషేకాలు

సామర్లకోట, జూన్ 23: పంచారామ పుణ్యక్షేత్రమైన సామర్లకోట కుమార రామ భీమేశ్వరా లయంలో శివలింగానికి భారతీయ పురావస్తుశాఖ ఉన్నతాధికారుల అనుమతుల మేరకు నేడు సోమవారం నుంచి అభిషేక పూజలు పునరుద్ధరించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి బళ్ల నీలకంఠం చెప్పారు. గత సోమవారం నుంచి మూలవిరాట్‌కు పూజలు, దర్శనాలకు అనుమతులు ఇచ్చినప్పటికీ శివలింగానికి అభిషేక పూజలకు మాత్రం అనుమతులు లభించలేదు. అధిక సంఖ్యలో భక్తుల విజ్ఞాపనల మేరకు భారతీయ పురావస్తుశాఖ ఉన్నతాధికారులు అభిషేక పూజలకు సోమవారం నుంచి అనుమతులు మంజూరు చేశారు. దీంతో భక్తులు హర్షం వ్యక్తం చేశారు. ఆలయ ఈవో భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

రీజెన్సీ విధ్వంసం కేసులో

ఇద్దరు అధికారులకు జైలు

యానాం, జూన్ 23: యానాంలో సంచలనం కలిగించిన రీజెన్సీ సంఘటనకు సంబంధించి కేసుల్లో ఇద్దరు పోలీసు ఉన్నతాధికారులకు కోర్టు జైలుశిక్ష విధించింది. 2012లో జరిగిన ఈ సంఘటనలో యూనియన్ నాయకుడు మృతి, యాజమాన్యానికి చెందిన ప్రతినిధి హత్య, పరిశ్రమ ధ్వంసానికి సంబంధించి పలు కేసులు నమోదయ్యాయి. అనంతరం సీబీఐ విచారణ జరిగింది. పరిశ్రమను తగులబెట్టిన ఘటన, పోలీస్‌స్టేషన్‌లో కార్మిక నాయకుడు మృతి కేసుల్లో ఇద్దరు పోలీసు అధికారులకు పుదుచ్చేరి సీజేఎం కోర్టు రెండేళ్ల జైలు శిక్ష, రూ.4వేలు జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చింది. ఈ కేసులో అప్పటి సీఐ పెరియస్వామి (ప్రస్తుతం ఉద్యోగ విరమణచేశారు), ప్రస్తుతం పుదుచ్చేరిలో విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ వీరభద్రస్వామి ఉన్నారు. ఈ సంఘటన యానాంలో మాయని మచ్చగా మిగిలిపోయింది. ప్రస్తుతం పరిశ్రమ పునఃప్రారంభిస్తున్న నేపథ్యంలో ఈ తీర్పు ప్రాధాన్యం సంతరించుకుంది. మిగిలిన కేసుల్లో తీర్పు ఏమిటనేది తీవ్ర చర్చకు దారితీస్తోంది.

పిల్లలతో తల్లి గోదావరిలో దూకే యత్నం

- ప్రాణాలను కాపాడిన పోలీసులు



బాధితురాలితో మాట్లాడుతున్న పోలీసులు

ఐ.పోలవరం, జూన్ 23: కుటుంబ కలహాల నేపథ్యంలో ఒక తల్లి ఇద్దరు పిల్లలతో గోదావరిలో దూకేందుకు ప్రయత్నించగా సమాచారం అందుకున్న ఐ.పోలవరం పోలీసులు సమయస్ఫూర్తితో వారిని రక్షించారు. కాకినాడకు చెందిన చింతలపూడి గీతాంజలి భర్తపై కోపంతో తన ఇ ద్దరు పిల్లలతో కలిసి శనివారం రాత్రి బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా ఐ.పోలవరం మండలం ఎదురులంక బ్రిడ్జిపై నుంచి గోదావరిలో దూకేందుకు ప్రయత్నిస్తుండగా అటు గా వెళ్తున్న ప్రయాణికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. హెడ్ కానిస్టేబుల్ మురళీకృష్ణ, కానిస్టేబుల్ విజయకుమార్ వెంటనే వచ్చి వారి ప్రాణాలను రక్షించారు. కుటుంబ సభ్యులకు వారిని అప్పగించారు. పోలీసుల సమయస్ఫూర్తిని ప్రజలు ప్రశంసించారు.

'లోవ'లో భక్తుల సందడి



ఆలయ ప్రాంగణంలో భక్తులు రద్దీ

తుని రూరల్, జూన్ 23: ప్రసిద్ధిపుణ్యక్షేత్రంలో లోవదేవస్థానం ఆదివారం భక్తులతో కోలాహలంగా మారింది. అమ్మవారి దర్శనార్థం తెలుగురాష్ట్రాల నలుమూలల నుంచి వేలాదిగా వచ్చిన భక్తులతో ఆలయానికి రావడంతో భక్తులతో కిక్కిరిసింది. ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. భక్తులు అమ్మవారికి దర్శించుకుని మొక్కులు చెల్లించుఉని ఆలయప్రాంగణంలో గల ఆరుబయట మామిడితోటల్లో, వసతి గృహాల్లో వంటావార్పు చేసుకుని కుటుంబ సమేతంగా సహపంక్తి భజనాలు చేశారు. ఆదివారం ఒక్కరోజు భక్తుల ద్వారా వివిధ విభాగాల ద్వారా ఆలయానికి రూ.4.92లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో విశ్వనాద్‌రాజు ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రజా ఆకాంక్షల మేరకు నూతన ప్రభుత్వ పాలన

- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సుభాష్, చిత్రంలో సిటీ ఎమ్మెల్యే కొండబాబు తదితరులు

కాకినాడసిటీ, జూన్ 23: రాష్ట్రంలో ఏర్పడిన నూతన ప్రభుత్వం ప్రజా ఆకాంక్ష మేరకు సక్రమ మైన పరిపాలన అందిస్తోందని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. ఆది వారం తొలిసారిగా కాకినాడకు విచ్చేసిన మంత్రి సుభాష్ స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో విలేకరులతో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాలను గాలికి వదిలేయడంతో ప్రజలు తగిన గుణపాఠం చెప్పారన్నారు. నవరత్నాలు పథకాలను ఊదరకొడుతూ 175 సీట్లు వస్తాయని జగన్మోహన్‌రెడ్డి కలలు కన్నారన్నారు. 2014నుంచి 2019 వరకు చంద్రబాబు పాలనలో చంద్రన్న బీమా పథకం ద్వారా 2 కోట్ల 16 లక్షల మంది లబ్ధి పొందారన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కేవలం కోటి 25 లక్షల మందికి మాత్రమే సాయం అందించారన్నారు. అదే విధంగా ఎస్సీ, బీసీ, ఎస్టీ కార్పొరేషన్‌లను వైసీపీ నిర్వీర్యం చేసిందన్నారు. ఇవన్నీ గమనించిన ప్రజలు రాష్ట్రంలో కూటమికి భారీ మెజారిటీతో అధికారం కట్టబెట్టారన్నారు. గెలిచిన ఎమ్మెల్యేలు నియోజకవర్గంలో ప్రజలను కలుసుకుంటూ వారి సమస్యలను పరిష్కరించే దిశగా పని చేయా లని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూచించారన్నారు. రాష్ట్రంలో గత ఐదేళ్లలో ఇసుక దోపి డీ చేశారని, సామాన్య ప్రజలకు ఇసుక దొరక్కపోవడంవల్ల ఆ ప్రభావం భవననిర్మాణ కార్మికులపై పడిందన్నారు. ఇసుకకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కొత్త పాలసీని తీసుకురానుందన్నారు. దీని వల్ల భవన నిర్మాణ కార్మికులకు మేలు జరుగుతుందన్నారు. ప్రభుత్వ స్థలాల్లో అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణాలు చేస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. అంతేతప్ప కూటమి ప్రభుత్వంలో కక్ష సాధింపు చర్యలు ఉండవన్నారు. కార్మికులకు చెందాల్సిన రూ.3 వేల కోట్లు వైసీపీ ప్రభుత్వంలో దారి మళ్లించారన్నారు. లిక్కర్, ఇసుక దోపిడీతో రాష్ట్రాన్ని లూటీ చేశారని మంత్రి సుభాష్ మండిపడ్డారు. కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు మాట్లాడుతూ దివంగత ఎన్టీఆర్ టీడీపీ ఎజెండాలో పొందుపరిచిన మూడు గుర్తులు గృహం, చక్రం, నాగలి పేద బడుగువర్గాల శ్రేయస్సును చాటుతున్నాయన్నారు. ఈ గుర్తులు కార్మికుల ప్రాధాన్యతను, రైతుల ప్రాధాన్యతను, గృహ నిర్మాణం ప్రాధాన్యతను తేటతెల్లం చేస్తున్నాయన్నారు. కార్మికుల శ్రేయస్సు కోసం టీడీపీ ప్రభుత్వం ఎంతో పాటుపడిందన్నారు. అటువంటి ముఖ్యమైన కార్మికశాఖ మంత్రి బాధ్యతను సుభాష్‌కు అప్పగించడం అభినందనీయమన్నారు. రాష్ట్రంలో కార్మికుల సమస్యలను మంత్రి పరిష్కారానికి కృషి చేయనున్నారన్నారు. అదేవిధంగా చంద్రన్న బీమా అందరికీ అందేలా దృష్టి సారించారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కార్మికులకు అండగా ఉండి కార్మికుడు బాగుపడేలా ఈ ప్రభుత్వం ముందుకు పయనిస్తుందన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర టీడీపీ ఆరోగ్య విభాగం సభ్యు డు డాక్టర్ కొండమూరి సత్యనారాయణ, జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాసబాబా, నగర టీడీపీ అధ్యక్షుడు మల్లిపూడి వీరు, నాయకులు పప్పు దుర్గారమేష్, సుందరపల్లి గోపాలకృష్ణ, అనసూరి సతీష్, కొలిక్కిగడ్డ గంగరాజు, తెలగ్రాపు లక్ష్మీగణేష్, జొన్నాడ వెంకటరమణ, చోడిపల్లి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్‌లో సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

యానాం, జూన్ 23: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 2024-25ఏడాదికి ఖాళీ సీట్ల భర్తీకి విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వేలాయుధం తెలిపారు. డిప్లొమా ఎలక్ట్రానిక్స్ అండ్‌కమ్యూనికేషన్, కం ప్యూటర్, సివిల్ ఇంజనీరింగ్ బ్రాంచ్‌ల్లో సీట్లకు ఇంటర్వ్యూ ద్వారా భర్తీ చేయనున్నారు. బుధవారం ఉదయం 9.30నుంచి సాయంత్రం 5గంటల్లోపు హాజరుకావాలన్నారు. యానాం, ఇతర రాష్ట్రాల విద్యార్థులు ప్రవేశం పొందవచ్చన్నారు.

డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ బలిదాన దివస్

అమలాపురం టౌన్, జూన్ 23: భారతీయ జనసంఘ్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ బలిదాన దివస్‌ను అమలాపురంలోని విద్యుత్ కార్యాలయంలో బీజేపీ పట్టణ శాఖ అధ్యక్షుడు వెంపరాల భాస్కరశాస్త్రి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. బీజేపీ సీనియర్ నాయకుడు ఆర్వీ నాయుడు ముఖ్య అతిథిగా హాజరై శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఒకే దేశం, ఒకే చట్టం, ఒకే జాతీయ చిహ్నం అని చాటిచెప్పిన మహనీయుడు ముఖర్జీ అని వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మోకా వెంకటసుబ్బారావు, నారీ శక్తి రాష్ట్ర కన్వీనర్ చిట్టూరి రాజేష్, జిల్లా ఉపాధ్యక్షుడు దూరి రాజేష్, యువమోర్చా జిల్లా అధ్యక్షుడు కొండేటి ఈశ్వర్‌గౌడ్, అసెంబ్లీ కన్వీనర్ బీఎస్ మూర్తి, కాశిన ఫణీంద్ర, సుంకర సాయి, కట్టా నారాయణమూర్తి, బొంతు శివాజీ, సోరపల్లి శివ పాల్గొన్నారు. అలాగే ఈదరపల్లిలో బీజేపీ సీనియర్ నాయకుడు కర్రి తాతారావు అధ్యక్షతన భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ నిర్వహించారు. ముఖర్జీ చిత్రపటానికి సీనియర్ నాయకులు అరిగెల బాబి, ఆర్వీ నాయుడు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కొత్తపల్లి వంశీ, తలాటం అమ్మాజీ, డేగల వెంకటరామన్ తదితరులు పాల్గొన్నారు.


అమలాపురం: ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

రాయవరం: భారతీయజనసంఘ్ పార్టీ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని లొల్లలో ఆదివారం నిర్వహించారు. సర్పంచ్ చాట్రాతి జానకి రాంబాబు ఆధ్వర్యంలో బీజేపీ నేతలు ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఢిల్లీ ఒప్పందానికి వ్యతిరేకంగా ముఖర్జీ తన పదవికి రాజీనామా చేయడంతో పాటు ఆర్టికల్ 370 దేశానికి ప్రమాదకరమని గుర్తించి ప్రాణాలను సైతం లెక్క చేయకుండా పోరాడారన్నారు. అనంతరం గ్రామంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శాకా దుర్గా శ్రీనివాస్, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, నరాల రాంబాబు, పిల్లి సత్యనారాయణ, కాలా రాంబాబు, ఈరెళ్ల కృష్ణమూర్తి, చిరట్ల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

మలికిపురం: భారతీయ జనసంఘ్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని కేశనపల్లిలో బీజేపీ నాయకులు ఆదివారం జరిపారు. శ్యామ్‌ప్రసాద్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అడబాల సత్యనారాయణ, అడబాల రాంబాబు, బాలాజీ, వెంకన్నబాబు పాల్గొన్నారు.

మామిడికుదురు: శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ సేవలు చిరస్మరణీయమని బీజేపీ మండలశాఖ అధ్యక్షుడు మెండా ఆదినారాయణ పేర్కొన్నారు. మామిడికుదురులో శ్యామ్‌ప్రసాద్ వర్ధంతి నిర్వహించారు. ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కంకిపాటి సుబ్బారావు, నక్కా త్రిలోచనరావు, పసుపులేటి మహలక్ష్మిరావు, కటికిరెడ్డి తమ్మయ్యనాయుడు, బండారు పల్లంరాజు, కటికిరెడ్డి గంగాధరం, కోటిపల్లి సాయిబాబు పాల్గొన్నారు.

కొత్తపేట: జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా అయన చిత్రపటానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం పూలమాలవేసి నివాళులర్పించారు. బీజేపీ నాయకులు సబ్బవరపు సత్యనారాయణ, తురగా ఆంజనేయులు, యు.ప్రసాదరాజు, తోరం సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

అంతర్వేది: బీజేపీ సఖినేటిపల్లి మండల అధ్యక్షుడు పట్టాపు సూర్యప్రకాశరావు ఆధ్వర్యంలో భారతీయ జనసంఘ్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ బలిదాన దివస్ వర్ధంతి కార్యక్రమాన్ని వీవీమెరక గ్రామంలో రాష్ట్ర కిసాన్‌మోర్చా డ్రైనేజీ సెల్ కన్వీనర్ చెంపాటి శివరామకృష్ణంరాజు ఇంటి వద్ద నిర్వహించారు. బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మాలే శ్రీనివాసనగేష్, రాష్ట్ర కిసాన్‌మోర్చా డ్రైనేజీ సెల్ కన్వీనర్ చెంపాటి శివరామకృష్ణంరాజు, పోలిశెట్టి గంగాశ్రీగిరిబాబు, తిరుమల వెంకటేశ్వరరావు, బోనం నాయుడు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

సంజయ్‌గాంధీ వర్ధంతి

మండపేట, జూన్ 23: కాంగ్రెస్ పార్టీ యువనేత దివంగత సంజయ్‌గాంధీ 44వ వర్ధంతిని పార్టీ జిల్లా అధ్యక్షుడు కామన ప్రభాకరరావు సారధ్యంలో ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరుపుకున్నారు. సంజీయ్‌గాంధీ చిత్రపటానికి కామన స్థానిక నేతలతో కలిసి పూలమాలలువేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ నాయకులు, పాడిశెట్టి సత్యనారాయణ, కొడవళ్ల వెంకటసుబ్బారావు, కుచ్చు బాబీ, కాకి సూరిబాబు, వల్లభ దాసు, సతీష్, సత్యనారాయణ, ఆర్.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఐకు అభినందనలు

మలికిపురం, జూన్ 23: సార్వత్రిక ఎన్నికల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతిభద్రతలను కాపాడిన మలికిపురం ఎస్ఐ బి.సంపత్‌కుమార్‌ను ఆదివారం విద్యార్థి సంఘ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు పోలిశెట్టి గణేష్, చొప్పల రామకృష్ణ, సత్య శ్రీకాంత్, బన్ను, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ నిధులను జమ చేయాలి

మలికిపురం, జూన్ 23: వైసీపీ ప్రభుత్వంలో 14, 15 ఆర్థిక సంఘ నిధులను ఇతర పథకాలకు మళ్లించి పంచాయతీలకు తీరని నష్టం కలిగించారని పంచాయతీరాజ్ చాంబర్, రాష్ట్ర సర్పంచ్‌ల సమాఖ్య కార్యదర్శి విశ్వేశ్వరాయపురం సర్పంచ్ చెల్లుబోయిన హెలీన అన్నారు. పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్‌కల్యాణ్‌కు అభినందనలు తెలిపారు. ఉన్నతస్థాయి విచారణ జరిపి గ్రామ పంచాయతీ నిధులను దారి మళ్లించిన అధికారులను కఠినంగా శిక్షించాలని కోరారు. పంచాయతీలకు రావాల్సిన రూ.8,629కోట్లను పంచాయతీలకు తిరిగి చెల్లించాలని కోరారు. పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తొలిరోజే నిధుల దుర్వినియోగం గుర్తించినందుకు పంచాయతీ సర్పంచ్‌ల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. పంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం పూర్వ వైభవం తీసుకురావాలని హెలీన కోరారు.

పంచాయతీ నిధులు తిరిగి ఇప్పించండి

అంబాజీపేట, జూన్ 23: గ్రామాల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ఏపీకి కేటాయించిన 14, 15వ ఆర్థిక సంఘ నిధులను గత వైసీపీ ప్రభుత్వం కాజేసిందని, ఆ నిధులను తిరిగి ఇప్పించాలని ఉమ్మడి జిల్లా సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షురాలు, మాచవరం సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి కోరారు. పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్‌కల్యాణ్‌కు లేఖను అందించారు. పంచాయతీ నిధులను దారి మళ్లించిన అధికారులపై ఉన్నతస్థాయి విచారణ జరిపించి బాధ్యులైన అధికారులను కఠినంగా శిక్షించి, మళ్లించిన రూ.8,629కోట్ల సొమ్మును తిరిగి పంచాయతీలకు జమచేయాలని కోరారు. ఈసమస్యపై పంచాయతీ రాజ్ మంత్రి పవన్‌కల్యాణ్ అధికారులతో సమీక్ష జరపడం అభినందనీయమన్నారు.

పూర్వ విద్యార్థుల సాయం

రాజోలు, జూన్ 23: కుసుమ కృష్ణస్వామి కుమార్తె సత్యశ్రీ (10) అనారోగ్యంతో బాధపడుతోంది. అతడితో చదువుకున్న పొన్నమండ జడ్పీ ఉన్నత పాఠశాల 1992-93 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం రూ.35వేలు కృష్ణస్వామికి అందజేశారు. పూర్వ విద్యార్థులను ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో అడబాల సత్యనారాయణ, ఉమ, బాబి, యేడిద గంగాచలం తదితరులు పాల్గొన్నారు.

విదేశీ విద్యకు అబ్దుల్‌కలాం నామకరణంపై హర్షం

మామిడికుదురు, జూన్ 23: మైనార్టీ సంక్షేమ మంత్రిగా ఎన్ఎండీ ఫరూఖ్ బాధ్యతలు స్వీకరించిన వెంటనే విదేశీ విద్య పథకానికి మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం విదేశీ విద్యగా నామకరణం చేయడంపై టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ముఖర్రం హుస్సేన్ హర్షం వ్యక్తం చేశారు. నగరంలో జరిగిన మైనార్టీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ సోమవారం నియోజకవర్గానికి వస్తున్న సందర్భంగా జరిగే విజయోత్సవ ర్యాలీలో అధిక సంఖ్యలో ముస్లింలు పాల్గొని ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. మీర్ అబ్రార్ హుస్సేన్, ఎంకే అబ్బాస్, మీర్ కరం అలీ, ఇలియాస్ హుస్సేన్, ఆగా హుస్సేన్, షబ్బీర్ హుస్సేన్ పాల్గొన్నారు.

ఎస్‌ఐకు సన్మానం

అంతర్వేది, జూన్ 23: రాజోలు నియోజకవర్గంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో సఖినేటిపల్లి మండలంలో ఏవిధమైన అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసిన ఎస్ఐ ఎస్.రామును విద్యార్థి సంఘ నాయకుడు పోలిశెట్టి గణేష్ సన్మానించారు. విద్యార్థి మాజీ నాయకుడు చొప్పల రామకృష్ణ, కె.సురేష్, పోలిశెట్టి గంగాశ్రీహరిబాబు, యెనుముల సతీష్ పాల్గొన్నారు.

రామోజీరావు సేవలు వెలకట్టలేనివి

మామిడికుదురు, జూన్ 23: పాత్రికేయ, సామాజిక సేవలో ఈనాడు అధినేత రామోజీరావు చేసిన సేవలు వెలకట్టలేనివని మామిడికుదురు సర్పంచ్ గౌస్ మొహిద్దీన్, ఎంపీటీసీ నయినాల సీతామహలక్ష్మి కొనియాడారు. మామిడికుదురు ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో రామోజీరావు సంస్మరణ సభను ఆదివారం స్థానిక ఎస్టీ కాలనీలో నిర్వహించారు. అనంతరం ఎస్టీ కాలనీలో 160మందికి అన్నదానం చేశారు. స్థానికులు నయినాల సత్యంమూర్తి, మాజీ సర్పంచ్ కడలి రామకృష్ణ, నయినాల కాశీ, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు నయినాల సత్యదుర్గాప్రసాద్, కోశాధికారి యేడిద బాలకృష్ణారావు, సంయుక్త కార్యదర్శి గుబ్బల హరిబాబు, సభ్యులు కడియం త్రినాథస్వామి, యేడిద వెంకటేశ్వరరావు, బోయి రాంబాబు, తోరం సత్యనారాయణ, యేడిద లోకేష్, స్థానిక యువకులు బుంగా సుబ్బ, శెట్టిబత్తుల అజయ్, గెడ్డం ఉదయ్ పాల్గొన్నారు.

ఆలమూరు: ఈనాడు సంస్థల అధినేత చిలుకూరి రామోజీరావు చిరస్మరణీయుడని పలువురు వక్తలు కొనియాడారు. ఆలమూరులో ఆదివారం కొత్తపేట నియోజకవర్గ కమ్మ మహాజన సంఘం ఆధ్వర్యంలో రామోజీరావు సంస్మరణ సభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కొత్తపేట నియోజకవర్గ కమ్మ సంఘం గౌరవాధ్యక్షుడు వంటిపల్లి పాపారావు, దొడ్డపనేని త్రినాథరావు, నాయకులు పాల్గొన్నారు.

మహంకాళమ్మ, గంటాలమ్మ జాతర

అల్లవరం, జూన్ 23: బోడసకుర్రు గ్రామ దేవతలు మహంకాళమ్మ, గంటాలమ్మ జాతర ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది. శక్తి వేషాలు, గరగ నృత్యాలతో తిరునాళ్లను తలపించింది. అమ్మవార్ల దర్శనానికి, అన్నసమారాధనకు భక్తులు పోటెత్తారు. సోమ, మంగళవారాల్లో గ్రామ దేవతల ఆలయాల వద్ద తీర్థం జరుగుతుందని కమిటీ తెలిపింది. అల్లవరం ఎస్ఐ జి.హరీష్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఉత్సాహంగా ఒలింపిక్ డే రన్ ర్యాలీ


మామిడికుదురులో ఒలింపిక్ రన్‌ను ప్రారంభిస్తున్న ఎంఈవో లక్ష్మీనారాయణ

ఉప్పలగుప్తం, జూన్23: మండల వ్యాయామోపాధ్యాయుల ఆధ్వర్యంలో మొట్టమొదటిసారిగా భీమనపల్లిలో ఒలింపిక్ డే రన్ నిర్వహించారు. ఆదివారం జరిగిన కార్యక్రమంలో జడ్పీటీసీ గెడ్డం సంపదరావు, ఎంపీటీసీ దేశంశెట్టి నాగరత్నకుమారి ఒలింపిక్ జ్యోతితో రన్ ప్రారంభించారు. హెచ్ఎం నూకల సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగినకార్యక్రమంలో శిరంగు సత్తిరాజు, వ్యాయామోపాధ్యాయులుకామన మధు, పి.విఘ్నేశ్వరుడు, కరాటం ప్రసాద్, సీతాపతి, సరస్వతి, విజయభాస్కర్, మంచెం శ్రీనివాసబాబి, గొలకోటి తాతాజీ, వెంకటరాజు, కాశి దుర్గారావు, దేశంశెట్టి కిశోర్ పాల్గొన్నారు.

పి.గన్నవరం: ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పి.గన్నవరంలో ఒలింపిక్ డే రన్-2024ను నిర్వహించారు. ఈరన్‌లో స్థానిక విద్యార్థులు, క్రీడాకారులు పాల్గొన్నారు. విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్ కేవీరమణ, పీడీలు వై.నాగసతీష్, జీవీ సుబ్బారాయుడు, ఎస్‌కే కమల్, ఎం.దుర్గాప్రసాద్, ప్రభాకర్, జి.శ్రీనివాస్, నరేష్ పాల్గొన్నారు.

మామిడికుదురు: మామిడికుదురులో ఒలింపిక్ డే రన్‌ను ఉత్సాహంగా జరిగింది. ఈరన్‌ను ఎంఈవో ఎం.లక్ష్మీనారాయణ ప్రారంభించారు. మండల పరిషత్ కార్యాలయం నుంచి స్థానిక బస్టాండు కూడలి వరకు జరిగిన రన్‌లో విద్యార్థులు, వ్యాయామ ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు. రన్‌లో పాల్గొన్న విద్యార్థులకు ఎంఈవోలు సర్టిఫికెట్లు అందించారు మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్ మట్టా శ్రీధర్, పీడీలు బళ్ల శ్రీనివాస్, మట్టా శ్రీనివాసరావు, పీఈటీ పి.జయప్రకాష్, అప్పన రామకృష్ణ పాల్గొన్నారు.

అంబాజీపేట: పీడీ కె.ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ నుంచి ఒలింపిక్ డే రన్‌ను నిర్వహించారు. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, పీడీలు అందె సూర్యనారాయణ, సూర్యనారాయణ, ఎ.శ్రీనివాస్, తైక్వాండో కోచ్ పితాని త్రిమూర్తులు, పీఈటీ అందె సూర్యకుమారి పాల్గొన్నారు.

ఆత్రేయపురం: వద్దిపర్రులో తమ్మేటి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఒలింపిక్ డే రన్ నిర్వహించారు. మదర్ థెరిస్సా స్పోర్ట్స్-అండ్ సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మార్షల్ ఆర్ట్స్ గ్రాండ్ మాస్టర్ టి.అబ్బులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విజేతలకు సర్టిఫికెట్లు అందజేశారు. చారిటబుల్ ట్రస్టు వలంటీరు చిన్నారి, విజయ్, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రావులపాలెం: మదర్ థెరిసా స్పోర్ట్స్ సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఒలింపిక్ డే రన్‌ను గ్రాండ్ మాస్టర్ అబ్బులు ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థులతో ఒలింపిక్ రన్ నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు అల్లాడి శరత్ ఆధ్వర్యంలో జిల్లాలో పలుచోట్ల ఒలింపిక్ రన్ నిర్వహించినట్టు అబ్బులు తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందించారు.

వైసీపీ కార్యకర్తల సమావేశం

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూన్ 23: రామచంద్రపురం పట్టణం, మండల వైసీపీ కార్యకర్తల సమావేశం ఆదివారం సాయంత్రం స్థానిక ప్రసన్నవిఘ్నేశ్వర ఫంక్షన్ హాలులో పట్టణ కన్వీనర్ గాదంశెట్టి శ్రీధర్ అధ్యక్షతన జరిగింది. నియోజకవర్గ కన్వీనర్ పిల్లి సూర్యప్రకాష్ మాట్లాడుతూ ఎన్నికల్లో గెలుపు, ఓటములు సహజమన్నారు. పార్టీ కార్యకర్తలకు ఎటువంటి ఆపద వచ్చినా అండగా ఉంటానన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, ఎంపీపీ అంబటి భవానీ, వాసంశెట్టి శ్యామ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హరీష్‌కు టీడీపీ పార్లమెంటరీ విప్‌పై హర్షం

ముమ్మిడివరం, జూన్ 23: అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్‌ను పార్టీ విప్‌గా నియమించడం పట్ల ముమ్మిడివరం తెలుగుదేశం పార్టీ సమావేశం హర్షం వ్యక్తం చేసింది. ఆదివారం ముమ్మిడివరం పార్టీ కార్యాలయంలో అర్ధాని శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన పార్టీ సమావేశంలో ఏఎంసీ మాజీ చైర్మన్ గొలకోటి దొరబాబు, రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడు చెల్లి అశోక్ మాట్లాడారు. జీఎంసీ బాలయోగిని లోక్‌సభ స్పీకర్‌గా ఎంపికచేసి ప్రత్యేక గుర్తింపు ఇచ్చినట్టు ఆయన తనయుడు హరీష్‌కు పార్లమెంటు టీడీపీ విప్‌గా నియమించి గౌరవించడం హర్షణీయమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఈసందర్భంగా వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో హరీష్‌ను అత్యున్నత స్థాయికి తీసుకువెళ్లే బాధ్యత చంద్రబాబు తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు తాడి నరసింహారావు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పొద్దోకు నారాయణరావు, దొమ్మేటి రమణకుమార్, పొత్తూరి విజయభాస్కరవర్మ, గొల్లపల్లి గోపి, దాట్ల బాబు, చిక్కాల అంజిబాబు, ములపర్తి బాలకృష్ణ, పిల్లి నాగరాజు, మిమ్మితి చిరంజీవి, విళ్ల వీరాస్వామినాయుడు, యాళ్ల ఉదయ్, దంగేటి శ్రీనివాస్, కురసాల శిబాబు, కాశి లాజర్, నడింపల్లి శ్రీనివాస్‌రాజు, రెడ్డి సుబ్బారావు, పితాని రామకృష్ణ, సైదం అప్పారావు, మెండి కృష్ణంబాబు, ముమ్మిడివరపు వరలక్ష్మి పాల్గొన్నారు.

అమలాపురం టౌన్: కేంద్ర రాజకీయాల్లో అమలాపురం ఎంపీ విజేత గంటి హరీష్‌మాధుర్‌కు సముచిత స్థానం కల్పించాలని టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు కోరారు. హరీష్‌ను లోక్‌సభలో టీడీపీ విప్‌గా నియమించడం పట్ల వారు హర్షం ప్రకటించారు. అమలాపురంలోని ఎంపీ కార్యాలయంలో ఆదివారం ఎస్సీ సెల్ అధ్యక్షుడు పొద్దోకు నారాయణరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. లోక్‌సభ దివంగత స్పీకర్ బాలయోగి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి చుట్టుగుళ్ల కిశోర్, రాష్ట్ర నాయకుడు చిల్లా పురుషోత్తం, బడుగు భాస్కరజోగేష్, బత్తుల సాయి, గోనిపాటి రాజు, గుమ్మడి వెంకటేశ్వరరావు, రాపాక ఆనందకుమార్, మోత వెంకటేశ్వరరావు, అయితాబత్తుల మధు పాల్గొన్నారు.


ముమ్మిడివరం: మాట్లాడుతున్న గొలకోటి దొరబాబు

కొత్తపేట: అమలాపురం ఎంపీ విజేత గంటి హరీష్‌మాధుర్‌ను టీడీపీ పార్లమెంటరీ విప్‌గా నియమించడంపై ఆ పార్టీ కోనసీమ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు మహ్మద్ మీరాన్ షరీఫ్ హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. లోక్‌సభ దివంగత స్పీకర్ బాలయోగి తనయునిగా కోనసీమ అభివృద్ధికి కృషి చేస్తారని షరీఫ్ ఆశాభావం వ్యక్తం చేశారు.

అంతర్వేది: అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్‌కు టీడీపీ విప్ పదవిని కేటాయించడంపై సఖినేటిపల్లి మండల టీడీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు ముప్పర్తి నాని, వనమాలి మూలాస్వామి, తిరుమాని ఆచార్యులు, పప్పుల రమేష్, జనసేన నాయకులు గుబ్బల ఫణికుమార్, గెడ్డం మహలక్ష్మిప్రసాద్, రావూరి నాగు, ఉండపల్లి అంజి తదితరులు పాల్గొన్నారు.

యువతి హత్యపై ప్రభుత్వ చర్యలు భేష్

అమలాపురం టౌన్, జూన్ 23: బాపట్ల జిల్లా ఈపురుపాలెంలో యువతిని మానభంగం చేసి అతి కిరాతకంగా హత్య చేసిన ఘటనపై ప్రభుత్వం తీవ్రంగా స్పందించిందని తెలుగు మహిళా జిల్లా అధ్యక్షురాలు పెచ్చెట్టి విజయలక్ష్మి పేర్కొన్నారు. హోం మంత్రి వంగలపూడి అనిత తక్షణం స్పందించి నిందితులను వెంటనే అరెస్టు చేయాలని ఆదేశాలు జారీ చేయడంతో పాటు బాధిత కుటుంబానికి సీఎం చంద్రబాబు అందించిన రూ.10లక్షల సాయాన్ని అందజేశారన్నారు. నిందితులను అరెస్టు చేసిన పోలీసులను, అందుకు కృషి చేసిన కూటమి ప్రభుత్వానికి అభినందనలు తెలిపారు. ఆదివారం అమలాపురం టీడీపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అధికారి జయవెంకటలక్ష్మి, మాకిరెడ్డి వీఎస్ఎస్ పూర్ణిమ, లక్కింశెట్టి సూర్యకుమారి, గెల్లా మీనాకుమారి, అప్పారి సుశీల, గెద్దాడ సత్యవాణి, మట్టపర్తి భారతి తదితరులు పాల్గొన్నారు.

జనసేన విజయోత్సవాలు

ఆలమూరు, జూన్ 23: చెముడులంకలో జనసేన ప్రోగ్రామ్స్ కమిటీ కమిటీ కోఆర్డినేటర్, న్యాయవాది చోడిశెట్టి చంద్రశేఖర్-పద్మలీల దంపతుల అధ్వర్యంలో ఆదివారం పవన్‌కల్యాణ్ విజయం పట్ల కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. చంద్రశేఖర్ దంపతులను జనసైనికులు సత్కరించారు. నాయకులు తమ్మన భాస్కరరావు, అడ బాల మాచరయ్య, రాకుర్తి వెంకటేశ్వరరావు, అడబాల ఆదినారాయణ, వెలిసి దొరబాబు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళాలు

మామిడికుదురు, జూన్ 23: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి నిత్యాన్నదాన పథకానికి గంగలకుర్రు అగ్రహారానికి చెందిన సింగంశెట్టి పుల్లేశ్వర స్వామి-గంగాభవానీ దంపతులు రూ.11,131, విజయవాడకు చెందిన బుర్ల రమేష్-శాంతికుమారి దంపతులు రూ.10,116 విరాళంగా అందించారు. దాతలకు స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందించి అభినందించారు.

ఆలయ వార్షికోత్సవ పూజలు

అమలాపురం రూరల్, జూన్ 23: బండారులంకలోని శ్రీభువనేశ్వరీ సమేత త్రయంబకేశ్వరస్వామి ఆలయ సన్నిధిలో గల శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవ పూజలను ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చింతా అత్తిలింగం కుటుంబ సభ్యులతో స్వామివారికి మహా రుద్రాభిషేకాలు, ప్రత్యేక పూజలను ఆలయ పురోహితుడు గుమ్మిడి సద్గురుసత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. చింతా మురళీ-శ్రావణి దంపతులు, చింతా మోహన్ కర్తలుగా వ్యవహరించారు. మాజీ జడ్పీటీసీ చింతా శంకరమూర్తి-చంద్రకళ దంపతులు, భక్తులు పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణకే వాకర్స్ క్లబ్‌లు ఏర్పాటు

అమలాపురం టౌన్, జూన్ 23: ఆధునిక సమాజంలో ఆరోగ్య పరిరక్షణకు అధిక ప్రాధాన్యతనిస్తూ అంతర్జాతీయంగా వాకర్స్ క్లబ్‌లు ఏర్పాటు చేస్తున్నట్టు అంతర్జాతీయ వాకర్స్ అధ్యక్షుడు వి.మురళీమోహన్ పేర్కొన్నారు. అమలాపురం శ్రీకళా గ్రాండ్స్‌లో ఆదివారం మురళీమోహన్ ఆధ్వర్యంలో వాకర్స్ అంతర్జాతీయ 158వ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. నడక ఆరోగ్యంతో ఒనగూరే ప్రయోజనాలను ప్రతీ పల్లెకూ తీసుకువెళ్లేందుకు కృషి చేయాలన్నారు. ఎన్నో రోగాలను దూరం చేసే శక్తి నడక వ్యాయామానికి ఉందని వివరించారు. తమిళనాడు, తెలంగాణ, ఒడిసా, ఆంధ్రప్రదేశ్ నుంచి 350 మంది ప్రతినిధులు అంతర్జాతీయ కౌన్సిల్ సమావేశానికి హాజరు కాగా స్థానిక క్లబ్ అధ్యక్షుడు బోనం సత్యవరప్రసాద్, మహిళా అధ్యక్షురాలు బీహెచ్ పద్మావతి స్వాగత కార్యక్రమాలు నిర్వహించారు. భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళికలపై చర్చించారు. అంతర్జాతీయ సలహాదారు రామానందం, 2025 అధ్యక్షురాలు ఎం.ప్రభావతి వాకర్స్‌కు దిశానిర్దేశం చేశారు. వాకర్స్ క్లబ్ ప్రతినిధులు డాక్టర్ పీఎస్ శర్మ, పచ్చిగోళ్ల శ్రీనివాస్, టి.సత్యనారాయణరెడ్డి, సప్పా నాగేశ్వరరావు, రంకిరెడ్డి కాశీ, డాక్టర్ గోకరకొండ నాగేంద్ర, వీవీఆర్ నాయుడు, పి.రాజా, వైఎస్ఎన్ మూర్తి, పుత్సా కృష్ణకామేశ్వర్, గోటేటి గంగాధర్, గుర్రం రామకృష్ణ, చిక్కాల సతీష్, జంపన సుమన్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చింతాలమ్మవారి జాతర

మామిడికుదురు, జూన్ 23: పాశర్లపూడిలంక గ్రామదేవత చింతాలమ్మవారి జాతరను శనివారం రాత్రి భక్తులు ఘనంగా నిర్వహించారు. తీన్‌మార్ డప్పులు, గరగ నృత్యాలు, బాణసంచా కాల్పులతో జాతర ఘనంగా జరిగింది. ఆదివారం భక్తులు అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. మంగళవారం తీర్థం, సిరిబొమ్మ ఊరేగింపు జరుగుతుందని కమిటీ తెలిపింది.

నిత్యాన్నదానానికి రూ.1,01,116 విరాళం

అంతర్వేది, జూన్ 23: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యాన్నదాన ట్రస్టుకు గుడిమెళ్లంకకు చెందిన అప్పన చంద్రరావు రూ.1,01,116 విరాళాన్ని ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణకు అందించారు. దాతలకు ఆలయ అధికారులు స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందించారు.

ముగిసిన స్వామివార్ల కల్యాణోత్సవాలు

కపిలేశ్వరపురం, జూన్ 23: వల్లూరులో శ్రీవేంకటేశ్వరస్వామి, కపిలేశ్వరపురంలో శ్రీజనార్థనస్వామివార్ల కల్యాణోత్సవాలు శనివారం రాత్రితో ముగిసాయి. శనివారం రాత్రి స్వామివార్ల శ్రీపుష్పోత్సవం వేదపండితుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా జరిపారు. ఆయా గ్రామస్తులు, అధిక సంఖ్యలో మహిళలు, భక్తులు స్వామివార్లను దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

సీఎం చంద్రబాబును కలిసిన ఎంపీపీ కేతా



రాజోలు, జూన్ 23: మంగళగిరి టీడీపీ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును ఎంపీపీ కేతా శ్రీను ఆదివారం మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రోడ్లు, డ్రైనేజీ, అభివృద్ధి పనుల గురించి వినతిపత్రం సీఎంకు అందజేసినట్టు తెలిపారు. సమస్యల పరిష్కారానికి సీఎం సానుకూలంగా స్పందించారని ఎంపీపీ సంతోషం వ్యక్తం చేశారు. గుడాల విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

మెల్‌బోర్న్‌లో టీడీపీ విజయోత్సవ సంబరాలు

ఆత్రేయపురం, జూన్ 23: వద్దిపర్రుకు చెందిన కిశోర్ బలుసు ఆస్ట్రేలియా దేశంలోని మెల్‌బోర్న్‌లో ఉంటున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఆయన జిల్లాకు వచ్చి టీడీపీ విజయానికి విశేష కృషి చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆదివారం మెల్‌బోర్న్‌లో కిశోర్ బలుసు ఆధ్వర్యంలో విజయోత్సవం నిర్వహించారు. 350మంది కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. గుంటూరు జిల్లాకు చెందిన మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నేత ఆలపాటి రాజేంద్రప్రసాద్ ముఖ్యఅతిధి హాజరయ్యారు. ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. సాంస్కృతిక ప్రదర్శనల అనంతరం విందు ఏర్పాటు చేశారు.

మొక్కు చెల్లించుకున్న రిక్షా కార్మికుడు

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూన్23: రామచంద్రపురంలో టీడీపీ గెలవాలని, సీఎంగా చంద్రబాబు ప్రమాణస్వీకారం చేయాలని కోరుతూ జోడుతూముల వద్ద కనకదుర్గమ్మకు పట్టణంలోని గుబ్బలవారిపేటకు చెందిన రిక్షా కార్మికుడు చెల్లుబోయిన సత్యనారాయణ మొక్కుకున్నాడు. టీడీపీ ఆవిర్భావం నుంచి ఎప్పుడు ఎన్నికలు జరిగినా అతడు రిక్షాతో ఎన్నికల ప్రచారం చేస్తున్నాడు. వాసంశెట్టి సుభాష్ ఘనవిజయం సాధించడం, చంద్రబాబు సీఎం ప్రమాణస్వీకారం చేయడంతో ఆదివారం సత్యనారాయణ రిక్షాతో వచ్చి కనకదుర్గమ్మ ఆలయంలో మొక్కు చెల్లించుకున్నాడు. ఊపిరి ఉన్నంత వరకు టీడీపీలో ఉంటానని, రిక్షాతో ప్రచారం చేస్తానని సత్యనారాయణ తెలిపాడు.

గాంధీజీ విగ్రహావిష్కరణ

కపిలేశ్వరపురం, జూన్ 23: అంగర మార్కెట్ ఏరియాలోని ఆదర్శ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఆదివారం అంగర వాసవిక్లబ్ సౌజన్యంతో నూతనంగా ఏర్పాటుచేసిన మహాత్మాగాంధీజీ విగ్రహాన్ని వాసవిక్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ మాటూరి వీరవెంకట నరసింహమూర్తి ఆవిష్కరించారు. సర్పంచ్ వాసా కోటేశ్వరరావు, ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ బొడా వీర్రాజు, చెక్కా సురేష్‌కుమార్, కాళ్ళకూరి సూర్యభాస్కరరావు, పులవర్తి లక్ష్మీపతి, కాళ్ళకూరి స్వామి, పేరూరి వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం

అయినవిల్లి, జూన్ 23: పి.గన్నవరం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం అయినవిల్లిలంకలో ఆదివారం జరిగింది. కోఆర్డినేషన్ కమిటీ సభ్యుడు చిట్టూరి శ్రీనివాస్ అతిథి గృహం వద్ద జరిగిన సమావేశానికి కమిటీ కన్వీనర్ నామన రాంబాబు అధ్యక్షత వహించారు. సమావేశంలో కూటమి అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ విజయోత్సవ ర్యాలీ అభినందన సభను విజయవంతం చేయాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. కూటమి అధికారంలోకి వచ్చిన సందర్భంగా సామాజిక పెన్షన్‌ను రూ.4వేలు, దివ్యాంగుల పెన్షన్ రూ.6వేలు, వ్యాధిగ్రస్తులకు రూ.10వేలు పెంచినందుకు సీఎం చంద్రబాబుకు అభినందనలు తెలిపారు. అమాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్‌ను పార్లమెంటు విప్‌గా నియమించినందుకు, రామచందరపురం ఎమ్మెల్యే వాసంశెట్టి సుభాష్‌ను కార్మికశాఖ మంత్రిగా ఎంపిక చేసినందుకు చంద్రబాబుకు అభినందనలు తెలియజేస్తూ తీర్మానించారు.

తిలక్‌బాబు సేవలు ప్రశంసనీయం

ద్రాక్షారామ, జూన్ 23: ఉపాధ్యాయుడిగా టి.వి.ఎస్. తిలక్‌బాబు అందించిన సేవలు ప్రశంసనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. వెంకటాయపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేసి ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన తిలక్‌బాబు, మెహర్ సుజాతదంపతులను ఉపాధ్యాయ సంఘాలు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు సత్కరించారు. డీవైఈవో ఎస్.ఎల్.నర్సింహఫణి, ఎంఈవోలు ఎం.శ్రీనివాసరావు, చోడిశెట్టి ఆంజనేయులు, జిల్లా సైన్సు అధికారి జి.వి.ఎస్.సుబ్రహ్మణ్యం, మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు, మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి శేషారెడ్డి, పీఆర్‌టీయు రాష్ట్ర అధ్యక్షుడు మిట్టా కృష్ణయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ కరుణానిధి మూర్తి, ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ నరాల కృష్ణకుమార్,ఉపాధ్యాయులు, జడ్పీటీసీ మేర్నీడి వెంకటేశ్వరరావు, గ్రామ సర్పంచ్ యల్లమిల్లి సతీష్‌కుమారి, వైస్ ఎంపీపీలు నరాల రాజ్యలక్ష్మి, శాఖా బాబి, సర్పంచ్‌లు నాగిరెడ్డి సతీష్‌రావు, పెమ్మిరెడ్డి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

శ్రీకనకమహాలక్ష్మి తీర్థ మహోత్సవం

పి.గన్నవరం, జూన్ 23: ఉడిమూడి గ్రామదేవత శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారి తీర్థ మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. శనివారం రాత్రి ప్రత్యేక గరక నృత్యాలు, బాణసంచా కాల్పులతో అమ్మవారికి ఉత్స వాలు నిర్వహించారు. పరిసర గ్రామాల ప్రజలు విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, ఎస్ఐ బి.శివకృష్ణ, ఎంపీటీసీ ఆదిమూలం సూర్యనారాయణ, స్థానిక నాయకులు అమ్మవారిని దర్శించుకున్నారు. సర్పంచ్ నూకపెయ్యి ప్రసన్నకుమార్ ఉత్సవాలను పర్యవేక్షించారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరామ	: --
వెంకటరమణ	: మనమే
శ్రీలలిత	: మహారాజ
శేఖర్ స్క్రీన్-1	: నింద
శేఖర్ స్క్రీన్-2	: అంతిమ తీర్పు
రమా	: ప్రభుత్వ జూనియర్ కళాశాల
గణపతి	: రాజధాని రౌడీ
వెంకటపద్మావతిస్క్రీన్-1	: హరోం హర
వెంకటపద్మావతి స్క్రీన్-2	: భజే వాయువేగం